
# మూగజీవులు

కల్లం సుందరరామిరెడ్డి



**చా**విడిలో పడుకుని వున్నాడు వెంకట్రామయ్య. ఆయనకి వయసు డెబ్బైకి పైగా వుంటాయి. అంత వయసులో కూడా దృఢంగా వున్నాడు మొన్నటి వరకూ. ప్రస్తుతం మనిషి బాగా తగ్గిపోయాడు. దానికి తోడు తరచూ దగ్గు వస్తోంది. ఊపిరి ఆడలేదు.

**గొం**తులేని కళ్లె నోటివరకూ వచ్చింది. కేకరిద్దామని లేవబోయి కుక్కిమంచం కావడంతో లేవలేక పోయాడు. దాంతో నోటిలోని కళ్లె బట్టల మీద పడింది. మంచినీళ్లకోసమని ప్రక్కకి తిరిగాడు. మంచం ప్రక్కన పెట్టివుంది మట్టిముంత ఒకటి. అది ప్రక్కకి దొర్లి వుంది. దానిలో చెయ్యి పెట్టాడు. వెక్కిరించినట్లుగా తగిలింది ఖాళీ ముంత అతడి చేతి వ్రేళ్లకి. ఒక్కసారిగా ఆయనకి ఎక్కడ లేని నిరుత్సాహం ఆవరించింది.

ఆ ముంత నిండా నీళ్లు పోస్తే రెండు రోజులు రావాలని కోడలి ఆజ్ఞ. ఆజ్ఞను ఉల్లంఘిస్తే చీదరింపులు, ఛీత్కారాలు. అదేమంటే బోరింగ్‌లు వేయించావా? బావులు తవ్వించావా? అంటుంది.

బ్రతిమాలుకుంటే మాయదారి సంత నా ప్రాణానికొచ్చారు. చచ్చీ వేధిస్తారు. బతికీ వేధిస్తారు అంటుంది. దాంతో మౌనం వహిస్తాడు వెంకట్రామయ్య. బెట్టుమాత్రం తగ్గలేదు. కొంగబెట్టు. చచ్చే ముసలోడిక్కూడా అంత బెట్టు ఎందుకో అంటూ ఇత్తడి చెంబుతో మంచినీళ్లు ఎత్తి ముంతలో పోస్తుంది. ఎన్నడూ మాట అనిపించుకోని వెంకట్రామయ్య కోడలి మాటలతో తల్లడిల్లిపోతాడు. నోరు ఎండిపోతే బాగుణ్ణు అనుకుంటాడు. ఆరోజు ఉదయమే నింపింది ముంత. అయితే అంతకు కొద్ది రోజుల క్రితమే ఈనిన లేగదూడ ఒకటి గెంతులెడుతూ మంచం వైపు రావడం, మంచం ప్రక్కనే వున్న ముంత దాని కాలి గిట్టలకు తగలడం, ముంతలో



## సత్తావున్న నటి ఐశ్వర్య

**నీ**లిరంగు కళ్ళతో, చూసినంతనే అందమంటే 'ఇదీ' అని అందరూ అనే చూడచక్కని నటి – ఈ ప్రపంచ మాజీ సుందరి – ఐశ్వర్యా రాయ్. జీన్స్ చిత్రంలో నృత్య సన్నివేశాల్లో ఎంతో రాణించిందిగా! మిగతా తారలంతా కూడ అసూయపడే నటనా, అందమూ ఐశ్వర్య సొంతం. ఆమెతో కలిసి 'ఔర్ ప్యార్ హోగయా' కోసం పని చేశాను. ఆమె ఎంతో సత్తావున్న నటి' అంటున్నాడు ఆ సినిమా డైరెక్టర్ రాహుల్ రావెల్. ఇదేమాట భారతీషా కూడా అన్నాడు. 'ఈ మధ్య ఆ అబ్ఒలె లౌట్ ఛలే లాంటి ఫ్లాప్‌ల టేస్టు చూసింది ఐశ్వర్య. కానీ 'తాళ్' సినిమా ఆమె జాతకాన్నే మార్చేస్తుంది' అని అన్నాడు. ఐశ్వర్య మాత్రం ఫ్లాప్‌ల గురించి మాట్లాడుతూ 'అందరూ నా తొలి సినిమాతోనే నేనేదో మాధురీ దీక్షిత్తు అనుకుంటున్నారంతా. ప్రపంచ మాజీ సుందరి నైనందువల్ల అందరికీ నా ముఖం బాగా పరిచయం అయివుంది. కాబట్టి విజయవంతమైన సినిమాలు రావాలని కోరుకోవడంలో ఆశ్చర్యం లేదు' అంది. అయినా ఐశ్వర్య ఫ్లాపుల్లో విజయం దాగి వుందా?( ఏమో సల్మాన్‌ని అడగాలి)

నీళ్ళు క్రిందికి ఒలికిపోవడం ఒకేసారి జరిగాయి. ఆయన అదృష్టం మంచిగుంది ముంత మాత్రం పగలలేదు. చేసేదేమీలేక పంచె చెంగుతో కళ్ళు తుడుచుకున్నాడు. వారం రోజులైంది నీళ్ళు పోసుకుని, బట్టలు వాసన వస్తున్నాయి. వంట్లో ఓపిక ఉన్నన్నాళ్ళు కష్టపడ్డాడు. ఆయన కష్టానికి కోడలి చెయ్యంత ముఖం చేటంత అయ్యేది. ఎంతో ఆప్యాయత, అనురాగం వలకబోసేది. కొసరి కొసరి వడ్డించేది. కోడలి ప్రేమకు వెంకట్రామయ్య పరవశుడయ్యేవాడు. కోడలు కాదు కూతురు అని మురిసిపోయేవాడు. ఎప్పుడైతే ఓపిక సన్నగిల్లిందో అనురాగం, ఆప్యాయత క్రమేపీ కనుమరుగయ్యాయి. వాటి స్థానంలో చిన్నచూపు, తేలికభావన మొదలయ్యింది. అందులో భాగంగానే దగ్గుతూ ఇల్లంతా రోత చేస్తున్నాడన్న నెపంతో మంచాన్ని చావిట్లోకి మార్చింది. కోడలి మాట జవదాటడు కొడుకు శివరావు. 'మందులు తెప్పించయ్యా' అని కొడుకుని బ్రతిమాలుకుంటుంటే, బతికి ఏంపాటు పడేయ్యాలా. పోయే ప్రాణమేగానీ వచ్చే ప్రాణం కాదుగా అని అసహ్యించుకుంటుంది కోడలు. ఆవేళనో ఈ వేళనో సత్తు కంచంలో ఓ ముద్దేస్తుంది.

నీరసంగా వుండడంతో కళ్ళు మూసుకున్నాడు. చిన్నపాటి చావిడి అది. ఒక ప్రక్క అరక సామాను, మరొక ప్రక్క ఎద్దులు కట్టేసి వున్నాయి. అవి బాగా మేసినట్లుంది. నెమరు వేస్తున్నాయి. లేగదూడ ఇంకా గెంతులేస్తూనే వుంది. అయితే వెంకట్రామయ్య మంచానికి కొద్దిగా దూరంగా, ఎద్దులకు దగ్గరగా కట్టేసి వుంది ముసలి గేదె ఒకటి. అది బక్క చిక్కి వుంది... డొక్కలు లోపలికి పోయాయి... కళేబరం పుట్టిపడుతున్నట్లుగా వుంది. దానికితోడు వళ్ళంతా పుళ్ళు. బాగా ఆకలవుతున్నట్లుగా వుంది. ముట్టెను ముందుకు చాచి నాలుక బైటికి పెట్టి ఎద్దులు తొక్కిన గడ్డి పరకల్ని అందుకోవాలని ప్రయత్నిస్తోంది. మిగతా గేదెలను జీతగాడు పొలం తోలుకెళ్లాడు.

మధ్యాహ్నం రెండవుతుందనగా కోడలొచ్చి ఎద్దులను నీళ్లకి విడిచింది. అవి తాగలేదు. ఎద్దులు తొక్కిన తొక్కుడు తీసుకెళ్లి పెంటలో వేసింది. ఎండు మేత ఎద్దుల ముందు వేసింది. ఎద్దులు మేతలో మూతి కూడా పెట్టలేదు. అప్పటికే వాటి పొట్టలు నిండి వున్నాయి. ముసలిగేదె ముప్పెను నేలకి ఆనించింది. దానికి తొక్కుడు పరకలు కూడా దొరుకుతాయి అన్న ఆశలేదు. ఎవరన్నా వేస్తారన్న నమ్మకమూ లేదు. కారణం అది ముసలిది కావడమే. దాని అవసరం వాళ్లకి తీరడమే. గోధూళి వేళయ్యింది. పొలం వెళ్లిన గేదెలు ఇళ్లకి వస్తున్నాయి. సరిగ్గా ఆ సమయంలో వచ్చారు నలుగురు మనుషులు చావిట్లోకి. వచ్చిన వారిలో వెంకట్రామయ్య కొడుకు కూడా వున్నాడు. మిగతా బేరగాళ్ళు ముసలి గేదెని పరిశీలిస్తుంటే శివరావు గతంలో ఆ గేదె పాడి గురించి గొప్పగా చెబుతున్నాడు. అప్పుడే కునుకు పట్టిన వెంకట్రామయ్యకి వారి మాటలతో మెలకువ వచ్చింది. బేరగాళ్ళు గేదెని లేవ గొడుతుంటే అడిగాడు 'ఏమిట్రా శివరావు గేదెని ఎందుకు లేవకొడుతున్నారు?' అని. కొడుకు స్పష్టంగా చెప్పాడు 'గేదెని బేరం పెట్టా'నని. ఉలిక్కిపడి 'ఎందుకు?' అన్నాడు.

''ముసలి గేదని''

''అయితేమాత్రం కటికోళ్లకి అమ్ముతావా?''

''ముసలిగేదెని కటికోళ్లు కాక మరెవరు కొంటారు?''

''అది సరే. అసలు గేదెని అమ్మవలసిన అవసరమేమొచ్చింది?''

''అవసరమేమీ రాలేదు. ముసలిది గాటి ముందు వుంటే దండగ అని బేరమెట్టాను'' అన్నాడు కొడుకు.

కొడుకు అన్న మాటలతో వెంకట్రామయ్యకు ఎన్నడూ లేని ఆవేశమొచ్చింది. లేనిశక్తి నంతా కూడదీసుకొని మంచంలోంచి లేచాడు. జారిపోతున్న పంచె చెంగుని సరిచేసుకున్నాడు. మంచం కోడుకు ఆనించి వున్న చేతికర్ర సాయంతో కొడుకు దగ్గరికెళ్లి ''తూ... నీయమ్మ! మన సుఖం కోసం, మన సంతోషం కోసం తన చివరి రక్తపు బొట్టుని కూడా పాల బొట్టుగా చేసిన గేదెరా అది. పనికిరాని తొక్కుడు వేసినా కాలు కూడా కదపకుండా కుండనిండా పాలిచ్చి మన కడుపులు నింపిన గేదెరా అది. అలాంటి గేదె ముసలిదైతే కర్కశంగా కసాయి వాళ్లకి అమ్ముతావా. అంతకంటే వేరే పాపమేదైనా వుంటుందా? బిడ్డొచ్చిన వేళ, గొడ్డొచ్చిన వేళ అంటారు. ఆ గేదె వచ్చిన తర్వాతే కదరా మన సంసారం పాల పొంగులా పొంగింది'' అన్నాడు.

''అయితే ఏం చెయ్యమంటావ్. నెత్తినపెట్టుకొని పూజించమంటావా?'' చిరాగ్గా అన్నాడు కొడుకు.

''అవేమీ వద్దు. రోజూ ఒక పన మేత, ఒక బుంగెడు నీళ్లు దాని ముఖాన పోయండి. చస్తే పొలంలో పాతి పెట్టండి'' అన్నాడు తండ్రి.

''పన మేతంటే దండగ కదయ్యా''

''అయితే ఎద్దుల దగ్గర తొక్కుడన్నా దాని ముఖాన వెయ్యరా'' అన్నాడు తండ్రి పెద్దగా. తండ్రి మాటలు ఛాదస్తమనిపించాయి కొడుక్కి. మతి స్థిమితం లేదేమో అనుకొన్నాడు. ''ఏంటయ్యా నీ ఛాదస్తం ఎడ్ల క్రింద తొక్కుడు దిబ్బలో వేసుకుంటే ఎరువు అవుతుంది. ఆ ఎరువును పొలానికేస్తే బలమవుతుంది. పనికిరాని ముసలి గేదెకేస్తే దండగ అవుతుంది'' అన్నాడు కొడుకు.

''నిన్ను కని పెంచటం కూడా నాకు దండగేరా''

అందామనుకొన్నాడు. అంతలో కోడలు వచ్చి ''నీకే పెట్టలేక ఛస్తున్నాం. దానికెక్కడ పెట్టి చచ్చేది'' అంది.

''నిజమేనమ్మా! ఉప్పెనలో వీధిన పడ్డ కుటుంబం కోసం నా ఒంట్లో ప్రతి రక్తపు బొట్టును పెట్టుబడిగా పది ఎకరాలు సంపాదించిన నాకు నాలుగు మెతుకులు పెట్టడానికి, తొక్కుడు వేసినా కూడా మన కడుపులు నింపిన దానికి నాలుగు గడ్డిపరకలు వేయడానికి మీకు చాలా కష్టంగా వుందమ్మా. ఎందుకంటే మాతో మీకు అవసరం లేదు కదా. ఏమ్మా! ఆ ముసలి గేదె కడుపున పుట్టినవే కదమ్మా ఇప్పుడున్న మూడు పాడి గేదెలు. వీటి కడుపున పుట్టిన గేదెలను అమ్మే కదమ్మా ఎడ్లను కొన్నది'' అన్నాడు.

''నువ్వు ఎన్నన్నా చెప్పయ్యా. గేదెను మాత్రం అమ్మవలసిందే'' అన్నాడు కొడుకు. ''అయితే నన్ను కూడా అమ్మరా! నేను కూడా ముసలివాణ్ణే కదా'' అన్నాడు తండ్రి. కోడలు ఫక్కున నవ్వి ''అది ఛస్తే దాని తోలు చర్మంగా ఉపయోగపడుతుంది. నువ్వు చస్తే దేనికి ఉపయోగపడతావు?'' అంది.

ఒక బలమైన కెరటం వెంకట్రామయ్య ముఖానికి తగిలినట్లయింది. చలిగాలి పవనం అతన్ని చుట్టుముట్టినట్లనిపించింది. కోడలతన్ని చులకన చేసి మాట్లాడుతుందనుకున్నాడే గాని మరీ అంత హీనంగా మాట్లాడుతుందనుకోలేదు. ఉబికి వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ ''సంతోషమమ్మా చచ్చిన తర్వాత కూడా మనిషి కంటే పశువే ఉపయోగపడుతుంది అన్న సంగతి గుర్తుంచుకున్నందుకు'' అని ''ఏమైనా సరే నా బొందిలో ప్రాణం వుండగా గేదెను అమ్మడానికి వీల్లేదు'' అన్నాడు నిశ్చయంగా. మరేమీ మాట్లాడలేక మౌనంగా లోపలికెళ్లారు కొడుకు కోడలు.

OOO

ఆ రోజు నుంచి వెంకట్రామయ్య పరిస్థితి మరింత దుర్భరంగా తయారయ్యింది. ఏదో ఒక వేళకు వచ్చే పచ్చడి ముద్ద కూడా కరువైంది. దానికి తోడు రోగం కూడా మరింత ఎక్కువైంది. మనిషి జీవచ్ఛవంలాగా తయారయ్యాడు. గేదె పరిస్థితి కూడా వెంకట్రామయ్య కంటే మెరుగ్గా ఏమీ లేదు. దానిది మూగ ఘోష, ఆయనది మౌన శోష. నాలుగు రోజులు గడిచాయి. ఇరు జీవుల పరిస్థితి మరింత దిగజారింది. ఆకలి తీరదు- ప్రాణం పోదు అన్నట్టుగా గేదె శరీరాన్ని కాకులు పొడుస్తున్నాయి. ఆయన నోట్లోకి ఈగలు పోతున్నాయి. ఆయన కదలలేదు. అది మెదలలేదు. పరిస్థితి రోజుల్లోకొచ్చింది. వెంకట్రామయ్య స్పృహలేని స్థితిలో వున్న ఒక మధ్యాహ్నవేళ రాముడూ... రాముడూ... అన్న పిలుపు విని కళ్ళు తెరిచాడు. పీక్కుపోయిన ముఖంలో ఏదో ఆశ. లోపలికి పోయిన కళ్లల్లో ఏదో వెలుగు కనిపించింది.

వచ్చిన వ్యక్తి ఎవరో వెంటనే గుర్తుపట్టాడు. తన పక్కలో కూర్చున్న వ్యక్తిని వాటేసుకుని బావురుమన్నాడు. వచ్చిన వ్యక్తి ఎవరో కాదు, వెంకట్రామయ్య బాల్య స్నేహితుడు సూర్యప్రకాశరావు. చిన్నప్పట్నుంచీ ఇద్దరూ ప్రాణస్నేహితులు. కలిసి తిరిగేవారు. కలిసి పడుకునే వారు. ఎప్పుడూ విడిపోయి ఎరగరు. అయితే వెంకట్రామయ్యకు పొలం పని అబ్బింది. సూర్యప్రకాశరావుకి చదువు అబ్బింది. దాంతో అతనికి ఉద్యోగమొచ్చి పట్నం వెళ్లాడు. ఐదేళ్ల క్రితం వచ్చి వెళ్ళాడు.

సూర్యప్రకాశరావుకి కడుపులో దేవినట్లయింది స్నేహితుని పరిస్థితి చూసి. ఎంత ఆపుకుందామన్నా దుఃఖం ఆగడం లేదు. స్నేహితుని గట్టిగా వాటేసుకొని ''ఒరే రాముడూ! ఏందిరా ఈ పరిస్థితి... నీ బిడ్డ ఏమయ్యాడు. నీ పది ఎకరాల ఆస్తి ఏమయ్యింది?... కష్టజీవివి నీకట్రా ఇన్ని కష్టాలు'' అని స్నేహితుడడుగుతుంటే సమాధానం చెప్పలేక పోయాడు వెంకట్రామయ్య. చిన్న పిల్లాడిలా వెక్కిళ్లు పెడుతున్నాడు.

''ఏరా రాముడూ! నిన్నీ స్థితిలో చూస్తానను కోలేదురా. శేష జీవితం హాయిగా గడుపుతావనుకున్నాను. ఒరే నీకిన్ని కష్టాలొస్తే ఒక్క ఉత్తరం ముక్కన్నా రాయించలేకపోయావా?'' అన్న సూర్యప్రకాశరావు గొంతు జీరబోయింది. ఈసారి కూడా వెంకట్రామయ్య మాట్లాడలేదు. వెక్కిళ్లు పెడుతూనే ఉన్నాడు. మరలా సూర్యప్రకాశరావే అన్నాడు 'నిన్ను ఒక్కక్షణం కూడా ఇక్కడుంచను. వెంటనే నా వద్దకు తీసుకెళ్తాను. పువ్వుల్లో పెట్టి చూసుకొంటాను' అని.

వెంకట్రామయ్య తల అడ్డంగా ఆడించాడు రానన్నట్లుగా.

''ఏం ఎందుకు రావు? నేను కూడా నీ కొడుకులాగా అన్నం పెట్టలేననుకుంటున్నావా? నీకా భయమొద్దు. నా గొంతులో ప్రాణం వున్నంతవరకూ నీకే కష్టం రానివ్వను. నాకు చాలా ఆస్తి వుంది'' అన్నాడు సూర్యప్రకాశరావు. వెంకట్రామయ్య మాట్లాడలేదు. ''ఏమిట్రా మాట్లాడవు? నాదగ్గరకి రావడానికి నామోషీనా?''

''ఊహూ''

''కొడుక్కి అవమానంగా వుంటుందనా?''

''కాదు''

''మరేమిటి?''

సమాధానం చెప్పలేదు వెంకట్రామయ్య. సూర్యప్రకాశరావుకి కొంచెం బాధగా వుంది స్నేహితుడి తిరస్కారానికి. గాలి నెమ్మదిగా వీస్తోంది. మరలా సూర్యప్రకాశరావే అన్నాడు. ''పోనీ ఒక పని చేద్దాం. నా దగ్గరకు రావడానికి నీకు అవమానంగా వుంటే పట్టణంలో నీలాంటి వారికోసం వృద్ధాశ్రమాలు చాలా వున్నాయి. వాటిల్లో చేర్పిస్తాను... నీకెలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేస్తాను- ఈ ఒక్క కోరికను కూడా కాదనకురా'' అన్నాడు ప్రాధేయ పూర్వకంగా.

అప్పుడన్నాడు వెంకట్రామయ్య ''మరి ఆ గేదెని ఏ వృద్ధాశ్రమంలో చేర్పిస్తావు. అది కూడా నాలాగే దగాపడ్డ జీవే కదా'' అని. ఈసారి మాట్లాడలేక పోవడం సూర్యప్రకాశరావు వంతయ్యింది.

''ఒరే ప్రకాశం! నీవు వచ్చావు, నా బాధలు తెలుసుకొన్నావు, నన్ను ఓదార్చావు. నా కష్టాలు తీరుస్తానన్నావు. మరి దానికోసం ఎవరు వస్తారు? దానిని ఎవరు ఓదారుస్తారు? ఈ లోకంలో మనుషుల కున్నట్లే మూగజీవులకు కూడా అనాథాశ్రమాలుంటే ఎంత బావుంటుంది'' అన్నాడు వెంకట్రామయ్య.

''నీ ఆలోచన ఉన్నతమైందే. కాదనను. కానీ నీకు వచ్చిన ఆలోచన ప్రతి మనిషికి రావాలి. అప్పుడే మూగ జీవులకు న్యాయం జరిగేది.''

''నిజమే. అందుకని నామాట కాదనకురా.''

''లేదురా. ఆ ముసలి గేదె నొదలిపెట్టి నీతో రావడానికి నా మనసొప్పటం లేదు. ఇరు జీవులం కలిసే బ్రతికాం. కలిసే ఈ కుటుంబం కోసం శ్రమించాం. కలిసే బాధలననుభవించాం. కలిసే చస్తాం'' అన్నాడు వెంకట్రామయ్య.

గేదె ముట్టె నేలకానించి వారివైపే చూస్తోంది. చెవులు రిక్కించి వారి మాటలు వింటున్నట్లుగా ఉంది. దాని కళ్ల నుంచి కన్నీరు కారుతోంది. సూర్యప్రకాశరావు ఏదో అనబోతుంటే వెంకట్రామయ్య అడ్డుపడి ''నా కోరికొకటి తీరుస్తావురా'' అన్నాడు ఆశగా.

''తప్పకుండా తీరుస్తాను. ఏమిటో చెప్పు'' అన్నాడు ఆదుర్దాగా.

''చచ్చిం తరువాత మా ఇరు జీవులకు కలిపి సమాధి చేస్తావా?''

ఉలిక్కి పడ్డాడు ప్రకాశరావు. అంతకు మించి చలించి పోయాడు. రెండు చేతులెత్తి స్నేహితుడికి దండం పెడ్తూ ''ఒరే రాముడూ! నువ్వెంతో ఎత్తుకెదిగిపోయావురా. ఉన్నత విలువలతో నాకందనంత ఎత్తుకి ఎదిగిపోయావ్. అక్షరం ముక్కరాని నీవు మూగజీవుల పట్ల చూపించిన కారుణ్యానికి గర్వపడుతున్నాను. నీ కోరిక తప్పకుండా తీరుస్తాను'' అంటూ స్నేహితుని చేతిలో చేయి వేసాడు. అప్పటికే వెంకట్రామయ్య ప్రాణాలు అనంతవాయువులలో కలిసిపోయాయి.